
నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 4 జూలై 2024 | NIZAMABAD



- ప్రతి పల్లెలో పదుల సంఖ్యలో బాధితులు
- అర్బన్ ప్రాంతాల నుంచి గ్రామాల్లోకి రవాణా
- 'స్టఫ్' వంటి కోడ్ భాషల్లో క్రయ, విక్రయాలు
- పోలీసుల దాడుల్లో భారీగా పట్టుబడుతున్న వైనం
- గ్రామస్థాయి కమిటీలతో అవగాహన తప్పనిసరి

# గాంజ.. పల్లెలపై పంజా



## మత్తులో టీనేజర్లు, యువకులే అధికం

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): గంజాయి మహమ్మారి గ్రామాలకు విస్తరించింది. పచ్చని పల్లెల్లో యువతను పీల్చి పిప్పి చేస్తున్నది. ప్రతి పల్లెలో కనీసం ఐదారుగురు గంజాయి బాధితులు ఉంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అర్బన్ ప్రాంతాల నుంచి సులువుగా గ్రామాల్లోకి గంజాయి వస్తుండడంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులే గంజాయికి అలవాటు పడుతుండడం ఆందోళన కలిగించే అంశం. ఊరి చివర శ్మశానం, చెరువు గట్లు, స్కూళ్లు, రోడ్లు, రైల్వే ట్రాక్‌లలో అడ్డాలు ఏర్పాటు చేసుకొని.. సాయంత్రం కాగానే బ్యాచ్‌ల వారీగా చేరుకొని.. అంతా కలిసి గంజాయి తాగుతున్నారు. కొన్నిచోట్ల రోడ్లపైనే గంజాయి పీల్చుతూ.. నానా హంగామా చేస్తున్నారు. అర్బన్ ప్రాంతాల్లోని విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని గంజాయి బ్యాచ్‌లు రూ.500, రూ.1000కి గ్రాముల చొప్పుల గంజాయి విక్రయిస్తున్నాయి. కాలేజీల్లో చదువుతున్న గ్రామీణ యువకులకు స్నేహం ముసుగులో సిగరెట్, బ్రీజర్, బీర్ వంటివి అలవాటు చేసి, ఆ తర్వాత గంజాయి వినియోగించేలా ప్రోత్సహిస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థల పరిశోధనలో వెల్లడైంది. ఇలా గంజాయి సేవిస్తున్న వారిలో టీనేజర్లే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. యవ్వనంలో హుషారుగా ఉండాల్సిన వారు.. ఎదురురొమ్ము పీక్కపోయి, ముఖమంతా పాలిపోయి, కండ్లు గుంజుకుపోయి, బలం లేక బక్కచిక్కి.. గంజాయి వ్యసనంతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎదుగూబొదుగులేని బిడ్డలను చూసి, తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

### 'స్టఫ్' కోసం ఎంతదూరమైనా..

'మాల్' అనే కోడ్ గంజాయికి అని సులువుగా తెలిసిపోతుండడంతో.. 'స్టఫ్' అనే మరో కోడ్‌తో గంజాయి క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో రైలుమార్గాలు ఉన్న గ్రామాల పరిధిలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. తక్కువ మొత్తంలో రైళ్లలోనే ఎక్కువగా గంజాయి సరఫరా అవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గంజాయికి అలవాటు పడిన వారు.. స్టఫ్ కోసం ఎంతదూరమైనా వెళ్తున్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఎండు గంజాయి కాకుండా గంజాయి చాక్లెట్లు తింటూ మత్తులో జోగుతున్నారు. పోలీసులు, నార్కోటిక్ బ్యూరో, ఎక్సైజ్ సిబ్బంది నిర్వహిస్తున్న దాడుల్లో అధిక మొత్తంలో గంజాయి, గంజాయి ఆయిల్, చాక్లెట్లు పట్టుబడుతుండడం గమనార్హం. ఆరునెల్లలో 2682 కేజీల గంజాయి, 91 కేజీల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. 1.25 కేజీల హషీష్ ఆయిల్, 117.2 గ్రాముల చరస్, 6 కేజీల ఓపీఎం, 384.4 గ్రా. ఎండీఎంఏ, 80 గ్రా. హెరాయిన్‌ను ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. ఇక పోలీసులు, నార్కోటిక్ సిబ్బంది స్వాధీనం చేసుకుంటున్న డ్రగ్స్ విలువ కోట్లలో ఉంటున్నాయి.



మంగళవారం వేల్పూర్‌లో గంజాయితో పట్టుబడిన నిందితుడు

### ఉమ్మడి జిల్లాలో ఇలా..

- ఈ నెల 1వ తేదీన బాన్సువాడ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పట్టుకొని 120గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు బోధన్‌లో ఓ మహిళ ఇంటి వద్ద 500 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- 2వ తేదీన వేల్పూర్ మండల కేంద్రంలో ఓ యువకుడి వద్ద 210 గ్రాముల గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. నిందితుడికి సరఫరా చేసే వ్యక్తిని పట్టుకునేందుకు యత్నించగా అధికారులను చూసి 2.10కిలోల గంజాయిని పారేసి పరారయ్యాడు.
- 3న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఇద్దరు వ్యక్తుల వద్ద 6.10కిలోల గంజాయిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ బృందం స్వాధీనం చేసుకున్నది



బుధవారం స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

> **గ్రామస్థాయిలో కమిటీలు వేస్తాం**
>
> సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనల మేరకు పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది సమన్వయంతో అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ఆ మేరకు కార్యాచరణ మొదలుపెట్టాం. డ్రగ్స్ అనర్థాలపై స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేలా విద్యాశాఖతో ఒప్పందం చేసుకుంటున్నాం. డ్రగ్స్‌కు బానిసైన వారిని దారిలోకి తెచ్చేందుకు రిహాబిలిటేషన్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. డ్రగ్స్ మహమ్మారిని తరిమేందుకు అందరూ కలిసిరావాలి.
>
> **- వీబీ కమలాసన్ రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్**

## రూరల్ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, జూలై 3 : రూరల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని రూరల్ ఎమ్మె ల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని ముల్లంగిలో రూ. 12 లక్షలతో నిర్మించిన గోదామును ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. సుద్దపల్లిలో గిడ్డంగి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రైతులకు త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి ఐదేండ్లలో 10 వేల ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయిస్తానన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బోధనా సిబ్బంది ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఇతర రాష్ట్రాల్లో కస్తూర్బా ఉపాధ్యాయులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించారని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. అనంతరం డిచ్‌పల్లి ఆదర్శ పాఠశాలలో మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నగేశ్‌రెడ్డి, ఎంపీపీ నర్సయ్య, మోపాల్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

## తాగునీటి సమస్య పరిష్కారం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఎడపల్లి, జూలై 3: 'గుక్కెడు నీటికి కటకట' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఎడపల్లి మం డలం ఠాణాకలాన్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. పంచాయతీ సెక్రటరీ నర్సయ్య బుధవారం పైపులైన్‌కు మరమ్మతులు చేయించి, నీటి సరఫరాను మెరుగుపర్చారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు.



పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న జీపీ సిబ్బంది



ధర్నా చౌక్‌లో ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

## జీవోను ఉపసంహరించుకోవాలి

### అంగన్‌వాడీల ధర్నా

కంఠేశ్వర్, జూలై 3: అంగన్‌వాడీ ఉద్యోగులను వంచించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు గత సెప్టెంబర్‌లో సమ్మె నిర్వహించడంతో అప్పటి ప్రభుత్వం 65ఏండ్లు నిండిన టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు ఆసరా పింఛన్ ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు. అందుకు భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం 65ఏండ్లు నిండిన వారికి రిటైర్మెంట్ ప్రకటించాలని, జూలై 1 నుంచి జీతాలు ఇవ్వొద్దని జీవో జారీ చేశారన్నారు. జీవో ప్రకారం టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ. 50వేలు మాత్రమే చెల్లిస్తామని పేర్కొన్నారని వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యోగులకు వారసత్వపు హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్నా శిబిరానికి వచ్చిన ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు, సీఐటీయూ అధ్యక్షుడు జైశంకర్ గౌడ్, కోశాధికారి చంద్రకళ, ఉపాధ్యక్షురాలు సూర్యకళ, శివరాజమ్మ, కరుణ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నాళ్లీ.. చెట్ల కింద పాఠాలు

**పాఠశాలలు పునఃప్రారంభమై** 20రోజులు కావస్తున్నది. అయినా చెట్ల కిందే బోధన సాగుతున్నది. అందుకు నిదర్శనమే నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాలోని ప్రాథమిక పాఠశాల. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద బడి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించినా.. పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జూన్ 12వ తేదీ నాటికే పనులు పూర్తవ్వాల్సి ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇంకా చెట్ల కిందే చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



పాఠశాల వద్ద కొనసాగుతున్న మరమ్మత్తు పనులు

## మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- ఏరియా దవాఖాన తనిఖీ

కామారెడ్డి, జూలై 3: దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని అన్ని విభాగాలను పరిశీలించి, రోగులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సేవలందించాలని సూపరింటెండెంట్ రాంసింగ్‌ను ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, అందుకు తగిన సహకారం అందిస్తానని చెప్పారు.

**మాతృ మరణాలు జరగకుండా చూడాలి**

మాతృ మరణాలు జరగకుండా సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశమై మాతృ మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో ప్రసవ సమయంలో మాతృ మరణాలు సంభవించకుండా జాగ్రత్తపడడం వైద్యాధికారుల కర్తవ్యం అని అన్నారు. ఏఎన్‌ఎం స్థాయి నుంచి వైద్యాధికారి, జిల్లాస్థాయిలో ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి వరకు అందరూ బాధ్యతతో ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ శోభారాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్